# అధైర్యపడకండి.. అండగా ఉంటాం



సారంగాపూర్ : బీర్‌పూర్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
- పలు బాధిత కుటుంబాలకు పరామర్శ

సారంగాపూర్, అక్టోబర్ 19: అధైర్యపడకండి.. అండగా ఉంటానని పలు బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఓదార్చారు. బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన ఉప సర్పంచ్ హరీశ్ నానామ్మ లచ్చవ్వ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. రేకులపల్లి గ్రామానికి చెందిన తాటిపల్లి నితిన్ అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని, బీఆర్ఎస్ యూత్ నాయకుడు పంజాల రాజు తండ్రి సత్త య్య మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించా రు. అలాగే కొల్వాయి గ్రామానికి చెందిన కొత్త నర్సయ్య, పసుల రాజం, గాజర్ల శ్రీనివాస్, గాజర్ల రాజవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే కొల్వాయి గ్రామంలో మడేలేశ్వర ఆలయానికి రూ.లక్షతో బోర్ మోటర్, రూ.2 లక్షలతో ప్రహరీకి నిధులు మంజూ రు చేసిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు రజక సంఘ సభ్యులు కృజత్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, జిల్లా రైతు బం ధు సమితి సభ్యుడు కొల్ముల రమణ, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు నారాపాక రమేశ్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయికల్, అక్టోబర్ 19: పట్టణ వర్తక సంఘం అధ్యక్షుడు, హనుమాన్ ఆలయ చైర్మన్ ఎనగందుల సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతుండగా గురువారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట రాయికల్ పట్టణ, మండల నాయకులు తదితరులున్నారు.

# రేపటి నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు

- 21 నుంచి 31వ తేదీ వరకు వరకు పలు కార్యక్రమాలు
- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 19: పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలను ఈనెల 21వ తేదీ నుంచి ఈ నెల 31 వరకు జిల్లాలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ఏటా అక్టోబర్ 21న పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో స్మృతి పరేడ్ నిర్వహించి అమరులు నివాళులర్పించే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం నుంచి జాతీయ ఐక్యత దినోత్సవమైన అక్టోబర్ 31 వరకు జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తామని వివరించారు. దీనిలో భాగంగా జిల్లాలో ఓపెన హౌస్ కార్యక్రమాలు నిర్వహించి పోలీసుల విధులు, సాంకేతిక వినియోగం, ప్రజల రక్షణలో పోలీస్ సేవలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. విద్యార్థులకు ఆన్‌లైన్ విధానంలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని, కేటగిరీ-1లో ఇంటర్మీడియట్‌లోపు విద్యార్థులకు సమర్థవంతమైన పోలీసింగ్ కోసం సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, డిగ్రీ ఆపై విద్యార్థుల కోసం సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. దీని కోసం విద్యార్థులు https://forms.gle/b7bejvzfo6j29Vuz6 లింక్ ద్వారా వ్యాసాన్ని ఆన్‌లైన్‌లో రాయాల్సి ఉంటుందన్నారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకు, ఎస్ఐ, ఆపై అధికారులకు సైతం వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని, పోలీసుల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తామని, పోలీస్ అమరవీరుల కుటుంబాల వద్దకు వెళ్లి అమరులకు నివాళులర్పిస్తామన్నారు. విద్యార్థులు, యువత, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు మూడు నిమిషాలకు మించకుండా పోలీస్ సేవలపై వీడియో తీసి ఈనెల 23లోగా పంపించాలన్నారు.

## స.హ చట్టం జిల్లా అధ్యక్షుడిగా రవీందర్



రవీందర్


కొడిమ్యాల, అక్టోబర్ 19: చెప్యాల గ్రామానికి చెందిన అక్కపెల్లి రవీందర్‌ను స.హ చట్టం జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు జాతీయ అధ్యక్షుడు పట్టాభి తెలిపారు. గతంలో సహ చట్టం ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేసినందుకు తనను నియమించినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పట్టాభీ ధన్యవాదాలు తెలిపారు.

## ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని వినతి

జగిత్యాల టౌన్, అక్టోబర్ 19: తెలంగాణ రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లాలోని ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్న ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని పీఆర్‌టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయినపల్లి ఆనందరావు కలెక్టర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ హన్మంతరావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులు, గర్భిణులు, ఆరు నెలలలోపు పదవీ విరమణ చేయబోయే ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## బూత్ లెవెల్ కమిటీలతో సమావేశం

రాయికల్, అక్టోబర్ 19: సింగరావుపేట, శ్రీరాంనగర్, కిష్టంపేట అల్లీపూర్, కుర్మపెల్లి, రాజనగర్, అయోధ్య, ఉప్పుమడుగు గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ రాయికల్ మండల అసెంబ్లీ ఎలక్షన్ కమిటీ సభ్యులు బూత్ లెవెల్ కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ కమిటీ సభ్యులకు ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో వార్డు కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల గ్రామ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బూత్ లెవెల్ కమిటీలతో సమావేశం నిర్వహిస్తున్న నాయకులు



విజేతలతో అధ్యాపక బృందం

## క్రీడలతో క్రమశిక్షణ పెంపొందుతుంది

జగిత్యాల టౌన్, అక్టోబర్ 19: క్రమ శిక్షణ నేర్చుకోవడానికి క్రీడలు తోడ్పడతాయని డీన్ ఆఫ్ అగ్రికల్చరల్ డాక్టర్ సీమ అన్నారు. గురువారం పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో క్రీడల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశంలో యువత 65 శాతం మంది ఉన్నారని, యువత నైపుణ్యాలను మెరుగుపర్చడానికి క్రీడలు ఉపయోగపడతాయన్నారు. పాలిటెక్నిక్ డైరెక్టర్ డాక్టర్ డీ పద్మ మాట్లాడుతూ, ప్రస్తుతం వ్యవసాయ పాలిటెక్నిక్ చదివిన విద్యార్థులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నతంగా ఉండడంతోపాటు రైతులకు సేవ చేయాలని సూచించారు. అనంతరం విజేతలకు మెమొంటోలతో పాటు షీల్డ్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకుడు డాక్టర్ బీ శ్రీనివాస్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతి నారాయణ భట్, ఉపకులపతి డాక్టర్ రఘునందనరావు, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జెల్లా సత్యనారాయణ, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, పాలిటెక్నిక్ ఓఎస్ఏలు, ఫిజికల్ డైరెక్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణ కమిటీ ఏర్పాటు

కొడిమ్యాల, అక్టోబర్ 19: మండలకేంద్రంలోని పట్టణ పోచమ్మ పునర్నిర్మాణ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఏలేటి నర్సింహారెడ్డి, అధ్యక్షుడిగా రాచకొండ చంద్రమోహన్, ఉపాధ్యక్షులుగా జలమాల్‌పూరి శ్రీను, నాంపల్లి సుధాకర్, ఆనందం, కోశాధికారిగా ఎర్రోజు శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా కొండ నాగరాజు, సహాయ కార్యదర్శిగా వొడ్నాల సాగర్, ముఖ్య సలహాదారులుగా జక్కుల మల్లేశం, సభ్యులుగా గర్వందుల రాజమౌళి, కంచర్ల శ్రీను, నల్లాల రాము, దీకొండ సంతోష్, కొప్పుల నారాయణ, సంద లక్ష్మణ్, వేముల కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ఎన్నికైన సభ్యులను శాలువాలతో సన్మానిస్తున్న గ్రామస్తులు

# దుర్గామాతకు ఎమ్మెల్యే పూజలు



రాయికల్ : పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

సారంగాపూర్, అక్టోబర్ 19: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం బీర్‌పూర్ మండల కేంద్రంలో శ్రీ నవదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సారంగాపూర్, లక్ష్మీదేవిపల్లి, పెంబట్ల, లచ్చక్కపేట, రేచపల్లి, బీర్‌పూర్, తుంగూర్, నర్సింహులపల్లి, కండ్లపల్లి, మంగెళ తదితర గ్రామాల్లో భక్తులు దుర్గాదేవిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. బీర్‌పూర్ శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయంలో అర్చకులు అమ్మవారి ఊరేగింపు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, బీర్‌పూర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు నారపాక రమేశ్, జిల్లా రైతు బంధు సమితి సభ్యుడు కొల్ముల రమణ, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప-రమేశ్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, మండపాల నిర్వాహకులు, నాయకులు, దీక్షాపరులు, అర్చకులు, మహిళలు పాల్గొన్నారు.

రాయికల్, అక్టోబర్ 19: రాయికల్ పట్టణంలో సంఘ మిత్ర సేవా సమితి ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాతను గురువారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పట్టణలో నవదుర్గా సేవా సమితి, కిష్టంపేట దుర్గా భవానీ మాతను దర్శించుకొని అన్నదానాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి -అచ్యుత రావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాణి-సాయికుమార్, కౌన్సిలర్ మ్యాకల కాంతారావు, కౌన్సిలర్లు, నాయకులు,భక్తులు పాల్గొన్నారు.



బోనమెత్తుకున్న ఎంపీపీ మేన్నేని స్వర్ణలత, జడ్పీటీసీ ప్రశాంతి

## బోనమెత్తిన ప్రజాప్రతినిధులు

కొడిమ్యాల, అక్టోబర్ 19: మండలకేంద్రంలోని వందేమాతం ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వాహకులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మేన్నేని స్వర్ణలత, జడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి బోనం ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. సింగిల్ విండో చైర్మన్ మేన్నేని రాజనర్సింగరావు అమ్మవారి విగ్రహాన్ని ఎత్తుకొని ఊరేగింపు నిర్వహించారు. పూడూర్, తిర్మలాపూర్ గ్రామాల్లో దుర్గామాత విగ్రహాల వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.